హాస్యం హాస్యం

# పట్టుచీర

మహర్షి

"ఈసారి పండుగకు ఏం చీర కొంటున్నారు మీవారు" కనకం పక్కింటి పంకజాక్షిని అడిగింది.

ఆమె ఓ వేడి నిట్టూర్పు విడిచి "నీ అదృష్టం బంగారం కాను. నాకంత రాత కూడనా? దేనికైనా ఆ బ్రహ్మ మన మొహాన గీసివుండాలి" ఫ్లాష్ బ్యాక్ లో కెళుతు అన్నది.

"అలా అంటారేమిటి పక్కింటి పంకజాక్షి గారూ! దీర్ఘం తీసింది కనకం బుగ్గని సొట్ట పడేలా వత్తుకుంటూ.

"నీ అసాధ్యం అదృష్టం కాను. బూరెల్లాంటి బుగ్గలు సొట్టలు పడి నలిగి పోతున్నాయి. ఆ వత్తుకోవడం ఆపు. ఏం చెప్పను తల్లీ! పెళ్ళి చూపుల నాడు మా వారు తెచ్చిన వాడిపోయిన మల్లెల్ని చూసి మా దూరపు చుట్టం ముసలిది చెప్పనే చెప్పింది"

కళ్ళ వెంట నీళ్ళు రాక పోయినా పైట చెంగు తీసి కళ్ళు వత్తుకుంటూ అన్నది పంకజాక్షి.

"ఏమన్నదేమిటి?" ఆతృతగా అడిగింది కనకం.

"ఎందుకులేమ్మా! తీరా చెప్పిన తరువాత కళ్ళ వెంట నీళ్ళు వచ్చే వరకు నవ్వుతావు పరేకానీ, ఈసారి ఏం ట్రిక్ ప్లే చేసి చీర కొట్టేద్దామనుకుంటున్నావు?"ఆశగా అడిగింది పంకజాక్షి.

"అమ్మా! నేను చెప్పను, చేసి చూపిస్తాను" అన్నది కనకం.

"ఆ అయినా ఈ మగాళ్ళు పెళ్ళయిన కొత్తలో ఏది కావాలంటే అది తెచ్చిస్తారు. కానీ కాస్త మోజు తీరాక ఎంగిలాకుకన్నా హీనంగా చూస్తారు. ఈసారి నీకు చీర దక్కే వరకు నాకు నమ్మకం లేదు"కుళ్ళుకుంటు అన్నది పంకజాక్షి.

"నా దగ్గర అలాంటి వంకాయ వేషాలు కుదరవు కాక కుదరవు. కావాలంటే చూడండి. ఎల్లుండి ఈపాటికి మావారు తెచ్చిన చీర మీకు చూపించి మీ...అన్నమాట" శపథం చేసింది కనకం.

"అదేదో నాక్కూడా చెప్పమ్మా నేను కూడా ఓ చీర తెప్పించుకుంటాను" అన్నది పంకజాక్షి బ్రతిమాలుతూ.

"కుదరదండి—నాది నాకే పరిమితం..వస్తాను ఇంట్లో కూర మాడిపోతున్నది. ఇదే చీరకు శుభ ముహూర్తం" అంటు ఇంట్లోకి పరుగెత్తింది కనకం.

0 0 0 0 0 0

కామేశం ఉలిక్కిపడి దుప్పటిని గబుక్కున మీదకు లాక్కుని ముసుగు తన్ని మళ్ళీ గుర్రు పెట్టడం గమనించిన కనకం చిన్నగా నవ్వుకుని చీపురు అందుకుని ఊడుస్తూ పాట అందుకుంది. "కోతి నోటికి కొబ్బరి కాయంట కొంగ చేతికి చేప ముల్లంట. కాకి నోటికి దొండ పండంట. నా ఖర్మకు ఈ నిద్ర మొద్దంట. లాలీ లాలీ, గాలీ గాలీ, వాలీ వాలీ".

నిద్రా భంగమైన కామేశం "ఆదివారం హాయిగా నిద్రపోనియ్యవాయ్! కాస్తఆ రేడియో ఆపు"అని మళ్ళీ రాగయుక్తంగా గురక పెడుతున్నాడు.

"ఈదిక్కు మాలిన గురక కంటే పందికొక్కుల మోత నయం. ష్ ష్ అంటే పారిపోతాయి మరో నాలుగు పాటలు పాడితే మీ తిక్క కుదిరి, నిద్ర ఎగిరిపోయి, చెప్పిన మాట వింటారు"అని మరో పాట అందుకున్నది.

"ఏవండోయ్ శ్రీవారు లేవండోయ్ సారు. మీ గురక ఆపండి నా పాట వినండి. బద్ధకం వదలండి. నిద్రలేవండి...."

"అయ్యోయ్యో! మనుషులకు వింత వింత జబ్బులొచ్చినట్లు రేడియోకి ఇదేం రిపేరే బాబూ! మ్యూజిక్ లేకుండా పాటలొస్తున్నాయేంటి?" ముసుగులోనే వుండి తల బరబర గీక్కుని, తలమంట పుట్టగా బేర్ మని ఏడ్చి, మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు.

కనకం పకపకానవ్వి అందుకే మీరు షాపుకెళితే మిమ్మల్ని మాటల్లో పెట్టి ప్రతి వస్తువు తూకం తక్కువ తూచి యిస్తారు. మీరు మరీ తింగరోడని అందరికీ తెలిసిపోయింది. మీ గురించి తెలియక మీ ఆకారం చూసి మోసపోయి ఇవాళ ఇలా పాటలు పాడుకుంటూ దుఃఖం బయటకు రానీయక పైట చెంగునోట్లో కుక్కుకుంటున్నాను" ముక్కు బ్రరున చీది తలుపు గబుక్కున మూసి బావురమని ఏడ్చింది కనకం.

"చూడు కనకం. ఇప్పుడు ఏం అన్నానని అలా బలవంతానా భూతకాలంలోనికి ఈడ్చుకెళ్ళి మరీ హింసిస్తావు. ఆదివారం కదా మరింత హాయిగా నిద్రపోదామనుకున్నాను. నా నిద్రను తెల్లారనీయకుండానే నీరుకార్చావు. ఛీ..ఛీ.. హు. హుర" అన్నాడు కామేశం దుప్పటిని మొహం మీద నుండి తొలగిస్తూ.

అప్పుడే ఏమైంది. సాయంత్రం వరకు ఇలా హింసించి, హింసించి చివరకు నా మాట కాదనను అనే వరకు వదలను. నా కోరిక ఈ రోజు తీర్చాల్సిందే. అనుకుని నవ్వుకున్నది కనకం.

గబగబా కాఫీ తయారు చేస కప్పులో పోసుకుని భర్తను లేపి "ఏవండీ శ్రీవారు! రాత్రంతా అలసిపోయారా? అయితే తీసుకోండి మీకిష్టమైన ఫిల్టర్ టీ ఫ..ఫ..ఫిల్టర్ లాంటి కాఫీ. ఈ రోజు ఉల్లాసానికి ఎల్లప్పుడు తీసుకోండి ఇన్‌స్టెంట్ కాఫీ" అన్నది

●●●●●●●●●●

**ఈ దిక్కు మాలిన గురకకంటే పందికొక్కుల మోత నయం.**

●●●●●●●●●●

మురిపెంగా.

కమ్మని వాసన కాఫీని చూసి ఆశ్చర్యంతో లేచి కూర్చున్నాడు కామేశం.

కమ్మని కాఫీ అందమైన భామ పొందు భలే పసందు ఆమెను దగ్గరకు లాక్కోబోయాడు.

"ఛ మీ నోరు కంపుకొడుతున్నది. ముందు మొహం కడుక్కోండి. అన్నది కనకం ముక్కు గట్టిగా మూసుకుని.

"అదేంటె భర్త దగ్గర కంపుకొడుతున్నదంటున్నావ్ నా మీద ప్రేమ తగ్గిందా?"

"కాదు. వంకాయి తగ్గింది. సర్లే, మీ నోటి దుర్వాసనను అరికడుతుంది కోల్గేట్ టూత్ పేస్ట్. మీ నోటిలోని క్రిముల్ని నాశనం చేస్తుంది పెప్సో డెంట్. పళ్ళ బాధ అయితే తీసుకోండి ప్రామిస్. మీ పళ్ళు పెద్ద శబ్దం వచ్చేలా తోముకోవాలని సరదాగా వుందా? అయితే వాడండి చీపురు. సుతిమెత్తగా తోముకోవాలని వుందా? అయితే వాడండి పుల్లయ్య గారివేప పుల్ల టూత్ బ్రెష్. వీటిలో ఏది కావాలో చెప్పండి" నవ్వుతూ గబగబా అడిగింది కనకం.

ఈమె వాలకం చూస్తుంటే ఈరోజు దేనికో ఎసరు పెట్టేలా వుంది. ఓరి భగవంతుడా నాకు ఏ గండం రాకుండాంకాపాడు అనుకుని దేవుడిన్ని ప్రార్థించాడు.

ఈరోజునాకు చీర కొని పెట్టక పోతే ఆ భగవంతుడుకూడా మిమ్మల్ని రక్షించలేడు. అనుకుని నవ్వుకుని "ఇవేవి వద్దు" అయితే వాడండి కచ్చికల పౌడర్. మీ నోటిలోని పళ్ళు మటుమాయం బోసి నోటితో విరునవ్వులు ఖాయం" అన్నది కనకం నవ్వుతూ.

ఓరి నాయనోయ్! పొద్దున్నే ఈవ్యాపార ప్రకటనల జోరేంటిరో నాయనోయ్! అని గుండెలు బాదుకుని భార్య అందించిన బ్రష్ అందుకుని పేస్ట్ ఏమిటో కూడా చూసుకోకుండా ముఖ ప్రక్షాళనం గావించాడు.

"ఏమండీ! ఫలానా కంపెనీ వాళ్ళు తయారు చేసిన ఇన్‌స్టెంట్ రవ్వతో ఇడ్లీచేసాను. అందులోకి చట్నీ ప్రియ ఊరగాయలు కావలని అందులో పదిహేను రకాలువున్నాయి. అవి ఒకటి... రెండు... పదిహేను... అన్నమాట. మీకు ఏం కావాలి? లేక వామన పచ్చళ్ళు భలేగా వుంటాయిలే. వాటిలో మీకు ఏది కావాలో చెబితే అదే వేస్తాను. ఏం వేయమంటారు?" కనకం గబగబా అడుగుతుంటే కళ్ళప్పగించి అలా చూస్తుండిపోయాడు కామేశం

వ్యాపార ప్రకటనలు భరించలేక టీవి కొంటావంటే వద్దని గోల చేసింది. పేపరు తీసుకుంటావంటే మొండికేసి మాన్పించింది. సినిమాకెళదామంటే రానని మొరాయించింది. అలాంటిది ఇవాళ లేచిన దగ్గరనుండి ఒకటే ప్రకటనలు వినిపిస్తుంటే భరించలేకపోతున్నాడు.

"ఏవండీ! స్నానానికి ఏం సబ్బు పెట్టమంటారు? గంగానదిలో మునిగితే ఎంతో పుణ్యమట. అందుకని మనకోసం గంగా జలంతో తయారు చేసిన గంగా సబ్బు యిమ్మంటారా? కమ్మని సువాసన సింథాల్ యిమ్మంటారా? లేక బోలెడు నురగ వచ్చే మెడిమిక్స్ యిమ్మంటారా? శ్రీదేవి మెచ్చిన లక్స్ యిమ్మంటారా? పోనీ.... అయితే... కాకుంటే... మరి.... యిమ్మంటారా? కిల కిలా నవ్వుతూ అడిగింది కనకం.

సబ్బులంటే విసుక్కుని నలుగు పిండితో స్నానం చేసే కనకం ఇలా మాట్లాడుతుంటే ఆశ్చర్యంగా అనిపించింది కామేశానికి. అయినా ఏం చేయగలడు! భరిస్తున్నాడు భర్తదాయకం ఎంతయినా కట్టుకున్న పెళ్ళాం కదా!




"మీకు వళ్ళు తుడుమకోటానికి మృదువైన టవల్ బాంబేడయింగ్ ఎంతో బాగుంటుంది. మీ రిష్టపడే గ్వాలియర్ రిన్ ఎందుకు వాడకూడదూ! అవసరమనకుంటే వాడండి భార్య పైటచెంగునే" నవ్వుతూ మరో ప్రకటన వినిపించింది.

కంగుతిన్నాడు కామేశం. ఇక టెన్షన్ భరించలేక అడిగేశాడు. "ఏమిటే పైత్యం తలకెక్కింది. ఏం కావాలో త్వరగా చెప్పు. ఇంకో ప్రకటన వినిపించావంటే పరాపరి సన్యాసుల్లో కలిసిపోతాను జాగ్రత్త" హెచ్చరించాడు గట్టిగా తల బాదుకుని కామేశం.

కామేశం వరం యివ్వగానే ఆనందంగా అరచి భర్తను గబగబా ముద్దులు పెట్టుకుంది.

"ఇవేం ప్రకటనలో నాకు అర్థం కావడంలేదు" అన్నాడు కామేశం విరాగ్గా మొహం పెట్టి.

"మొద్దు మొహమా ఇవి ప్రేమ ప్రకటనలు. నాకు పట్టుచీర కావాలి" అన్నది కనకం ఆనందంగా తల మునకలవుతూ

"ఓస్ పట్టుచీరకోసం ఇంత బాధ పెట్టాలా? అడిగితే కాదంటానా? అనేటప్పటికి ఎగిరిగంతేసిన కనకం కాలు బెణికి దబీమని క్రిందపడి కెవ్వు కెవ్వు, బావురుమని ఏడ్చింది. అయినా భర్త చీర తెస్తాడనే ఆనందంతో బాధ వెంటనే తగ్గిపోయింది.

0 0 0 0 0

చీర కొనటానికి తన భర్త ఎలా గంగిరెద్దులా తలవూపాడో పూర్తిగా వివరించింది కనకం పక్కింటి పంకజాక్షికి. ఆమె ఆనందంతో మునిగిపోయి "ఎంత చల్లని కబురు చెప్పావే తల్లీ! మావార్ని ఇలాగే బాధించి, బాధించి ఎలాగైనా ఒక్క పట్టు చీర కొనేలా చేయాలి" అంటూ గబగబా ఇంట్లోకి పరుగు తీసింది.

0 0 0 0 0

మధ్యాహ్నం మూడు గంటలవుతుండగా కనకం కామేశం ఒకరిమీద ఒకరు కాళ్ళు వేసుకుని నిద్రపోతున్నారు. అంతలో పక్కింటి పంకజాక్షి పెద్దగా శోకాలు తీస్తు వీధిలో కొచ్చింది. ఉలిక్కి పడిన జనం గబగబా బయటకొచ్చారు. పాపం ఆమె భర్త చిరిగి పోయిన బట్టలతో రేగి పోయిన జుట్టుతో గాలిలో చేతులు ఊపుకుంటూ అడ్డదిడ్డంగా నడచి వెళుతున్నాడు.

"అయ్యో పంకజాక్షి! భర్త అని కూడా ఆలోచించకుండా అలా బాదావేంటె? తల మీద దెబ్బలు తగిలాయేమో ఖర్మ మతి చెడిన వాడిలా వెళ్ళిపోతున్నాడు అన్నారు పక్కింటివాళ్ళు.

ఆమె కళ్ళు వత్తుకుంటూ "నాకంత అదృష్టం కూడానా! పాపిష్టిదాన్ని పండుగ పూట చీర కొంటారనే ఆశతో ఓ ట్రిక్ ప్లే చేశాను. అది కాస్త బెడిసి కొట్టింది. ఆయన మతి చెడి వెళ్ళిపోయారు. నాకెవరు దిక్కురా భగవంతుడా!" మళ్ళా శోకాలు అందుకుంది.

"ఏం చేశావు చెప్పు" అని ఒకామె పంకజాన్ని కుదిపి కుదిపి గడ్డం పట్టుకుని బ్రతిమాలింది.

"వద్దులే తల్లీ. నీకసలే పెళ్ళయి ఎక్కువ కాలం కాలేదు. నా ఖర్మకు నన్నే ఏడవనియ్" ఆమెను వదిలించుకుని ఇంట్లోకెళ్ళిపోయింది. పాపం పక్కింటి పంకజం. ●